

డీఎస్సీ ఉచిత శిక్షణకు గడువు పెంపు

సీతంపేట రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 పరీక్ష కోసం నిరుద్యోగ యువతకు ఇచ్చే శిక్షణ దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విశాఖ, విజయవాడ, తిరుపతి తదితర పట్టణాల్లోని మూడు రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించిన తర్వాత అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇంతకముందు డీఎస్సీ కోచింగ్ కోసం నిర్వహించిన ఆఫ్‌లైన్ పరీక్ష రద్దు చేసినట్లు చెప్పారు.

అమర వీరులకు వందనం

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా పోలీసు అమర వీరుల దినోత్సవం
- భాగస్వాములైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- వారి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- బాధితులకు అండగా ఉంటాం : కలెక్టర్ , ఎస్పీ

6లో



అమర వీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

రుణాలు సరే.. రికవరీ ఏదీ?



- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని క్షేత్రస్థాయి సిబ్బంది
- ఎస్‌హెచ్‌జీల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయలేకపోవడంపై విమర్శలు
- తలలు పట్టుకుంటున్న వెలుగు అధికారులు



సీతంపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘ సభ్యుల జీవనోపాధుల మెరుగుకు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేసిన అధికారులు రికవరీ ఊసు మాత్రం మరిచారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఎనిమిదేళ్లవుతున్నా.. పూర్తిస్థాయిలో వసూలు చేయలేకపోయారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సీతంపేట మండలంలో ఐకేపీ ఉన్నతస్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట మండలంలో మహిళా సంఘాల సభ్యులకు ఉన్నతి రుణాల కింద 2013 నుంచి 2021 వరకు సున్నా వడ్డీతో రూ.4.49 కోట్లు అందజేశారు. అప్పట్లో ఆఫ్‌లైన్ విధానంలో మహిళా సంఘాల సభ్యులు తీర్మానం చేసుకుని.. ఎంఎంఎస్ ద్వారా బ్యాంక్‌ల నుంచి రుణాలను అందించారు. అయితే 1214 మంది సభ్యుల నుంచి ఇంకా రూ.3.38 కోట్ల మేర రుణాలు రికవరీ కావాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యల్లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వాలు, వెలుగు అధికారులు మారుతున్నా.. పరిస్థితి మారడం లేదు. రుణాల రికవరీ నేటికీ రెండు శాతంగానే ఉండగా.. వసూళ్లలో ఎటువంటి ప్రగతి కనిపించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకునే వారేరీ?

- మండలంలోని 53 పంచాయతీల్లో ఉన్నతి పథకం కింద ఎస్‌హెచ్‌జీ సభ్యుల నుంచి కోట్లలో రికవరీ చేయాల్సి ఉన్నా.. పట్టించుకునే వారే లేరు. వాస్తవానికి మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చే రుణాలను.. వారు ఏ మేరకు వినియోగించుకుంటున్నారు, వాటి ద్వారా ఏ యూనిట్లను నెలకొల్పారు, సంఘాల పనితీరు వంటి అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాల్సి ఉంది. కింది స్థాయిలో పనిచేస్తున్న సీసీలు, సీఎఫ్‌లతో చర్చించాల్సి ఉంది. అయితే గడిచిన కొంత కాలంగా ఆ పరిస్థితి లేదు. 'వెలుగు'లో రెగ్యులర్ ఏపీడీ లేకపోవడంతో నేటికీ అటువంటి సమీక్షలేమీ జరగడం లేదు. ఉన్న ఇన్‌చార్జి ఏపీడీ కూడా పశు సంవర్థక శాఖకు చెందిన వారు కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.
- మండలంలో తొమ్మిది మంది సీసీలు, 51 సీఎఫ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు.

అయితే ఉన్నతి, స్త్రీనిధి రుణాలు రికవరీలో ప్రగతి కనిపించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాల సభ్యులకు ఉన్నతి రుణాలు ఇచ్చి సుమారు ఎనిమిదేళ్లవుతున్నా.. వాటి రికవరీ అంకెల్లో చూపుతున్నారు తప్పా ఎందుకు వసూలు చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు. దీనిపై వెలుగు ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. లేకుంటే ఎన్నాళ్లయినా ఉన్నతి రుణాలు రికవరీ పరిస్థితి ఇలానే ఉండనుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

మంజూరు ఇలా..

స్వయం శక్తి మహిళా సంఘాల సభ్యులకు గతంలో అంటే 2020 ఏడాది వరకు ఆఫ్‌లైన్ ద్వారా వడ్డీ లేని రుణాలను అందజేసేవారు. 2021 నుంచి సంఘం పేరు, సభ్యుల వివరాలన్నీ ఆన్‌లైన్ చేశారు. వ్యక్తిగత వేలిముద్ర(థంబ్) వేయించుకొని రుణాలను ఎస్‌హెచ్‌జీ ఖాతా నుంచి సంఘం సభ్యుల వ్యక్తిగత ఖాతాలోకి జమచేస్తున్నారు. దీంతో ప్రతి సంఘం సభ్యురాలు వ్యక్తిగత పూచీకత్తుపై రుణం తీసుకుంటున్నారు.

నోటీసులు ఇచ్చాం..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని టీపీఎంయూ (ట్రైబల్ ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్) మండ లాల్లో ఉన్నతి, స్త్రీనిధి రుణాల రికవరీ తక్కువగా ఉండడంపై సీసీలను హెచ్చరించాం. పీవో ఆదేశాల మేరకు సీతంపేట, కొత్తూరు మండలాల్లో ఎనిమిది మంది సీసీలకు షోకాజ్ నోటీసులను ఇచ్చాం. రుణాల రికవరీకి చర్యలు తీసుకుంటున్నాం.

- సన్యాసిరావు, ఇన్‌చార్జి ఏపీడీ, వెలుగు,సీతంపేట

స్త్రీ నిధి రుణాలు ఇలా..

మండలంలో ఉన్నతి రుణాలతో పోలిస్తే స్త్రీనిధి రుణాల రికవరీ కొంత మెరుగ్గానే ఉంది. 2022లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల సభ్యులకు 90 పైసలు వడ్డీతో రూ.2.12 కోట్ల వరకు స్త్రీనిధి రుణాలు అందించారు. అయితే నేటికి ఇంకా రూ.31.41 లక్షల మేర రికవరీ కావాల్సి ఉంది. మొత్తంగా 50 పంచాయతీల్లో స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ చూస్తే.. కీసరజోడు, మండ, కడగండి, గొయిది, సీతంపేట కొంత వరకు మెరుగ్గా ఉన్నాయి.



సమావేశంలో చర్చించుకుంటున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

ఫైలేరియా వ్యాప్తి చెందకుండా చర్యలు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



విజయనగరంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎంకు ఏనుగుల సమస్యను తెలియజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : బలిజిపేట మండలం పెద్దపెంకిలో బోద కాలు వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. సోమవారం విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం విజయనగరం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. బోద వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత, ఇతర ఆరోగ్య పరిస్థితులపై చర్యలు చేపట్టాలన్నారు. 2016-17లో బలిజిపేట మండలంలో పర్యటించినప్పుడు ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏప్రిల్ నెల నుంచి విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని, ఫాగింగ్ కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రక్షిత పథకాల వద్ద క్లోరినేషన్ చేస్తున్నామన్నారు.

ఏనుగుల సమస్య పరిష్కరించండి

జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. గజరాజుల వల్ల ఆస్తి, ప్రాణనష్టం ఎక్కువగా సంభవిస్తుందని, పంటలు కూడా నాశనమవుతున్నాయని తెలిపారు. జిల్లాకు కుంకీలను రప్పించి.. ఏనుగుల బెడద తప్పించాలన్నారు. మారుమల గిరిజన గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



6లో

నేడు పైడిమాంబ తెప్పోత్సవం

- ట్రయల్ రన్ విజయవంతం
- ఏర్పాట్లు పూర్తి

ఆడిస్తూ.. పాడిస్తూ.. చదివిస్తారు!

- వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఎడ్యుకేషనల్ వీడియో గేమ్స్
- 1 నుంచి పదో తరగతి వరకు యూట్యూబ్‌లో పాఠాలు
- విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా బోధన
- ఇదీ ఉషారాణి ప్రత్యేకత

6లో

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ప్రక్రియ ప్రారంభించిన అధికారులు
- తొమ్మిదేళ్ల అనంతరం నిర్వహణ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పార్వతీపురం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చేనెల 21 నుంచి 29 వరకు వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలకు సన్నద్ధమవుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో వీఆర్ఎస్, పెద్దగెడ్డ, పెదంకలం, ఒట్టిగెడ్డ రిజర్వాయర్ల పరిధిలో 25 నీటి సంఘాలకు, తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో 22, 15 మండలాల పరిధిలో ఉన్న చెరువులకు సంబంధించి 166 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలైంది. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాం (2015)లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి కాల పరిమితి 2020తో ముగిసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో సాగునీటి వనరుల అభివృద్ధి నిర్వహణ అటకెక్కింది. అప్పట్లో నీరు-చెట్టు, ఇతర నిధులతో సాగునీటి వనరుల అభివృద్ధిని నీటి సంఘాల ఆధ్వర్యంలో రైతులే నిర్వహించుకునేవారు. నీటి సరఫరా పరిస్థితి, ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా వారే చూసుకునే వారు. అయితే వైసీపీ ప్రభుత్వ వైఖరితో సాగునీటి వనరుల నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఇదీ షెడ్యూల్ ..

ఈ నెల 22 నుంచి 31లోగా సాగునీటి సంఘాల పరిధిలో ఓటర్ల వివరాలన్నీ సేకరిస్తారు. 31న ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. మేజర్, మీడియం సాగునీటి చెరువుల వారీగా వేర్వేరు తేదీల్లో ఈ జాబితా ప్రదర్శన ఉంటుంది. వచ్చేనెల 21న నీటి సంఘాల సభ్యుల ద్వారా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 24న డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలో, 27న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా...

- మైనర్ నీటి సంఘాలలో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్షుడిగా, మరొకరు ఉపాధ్యక్షుడిగా ఉంటారు.
- మీడియం, మేజర్ నీటి సంఘాల్లో 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్షుడిగా, మరొకరు కార్యదర్శిగా ఉంటారు.
- సాగునీటి సంఘాల్లో ఓటర్లు (రైతులు) చేతులు పైకెత్తి ఆమోదం తెలపడం ద్వారా సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.
- ఈ విధానంపై ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే చీటీలపై పేర్లు రాసి ఇవ్వాలని ఎన్నికలు నిర్వహించే అధికారులు కోరుతారు.

ప్రారంభమైన ప్రక్రియ

జిల్లాలో నాలుగు మీడియం, ఒక మేజర్ ప్రాజెక్టుతో పాటు చెరువుల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేశాం. నిబంధనలు ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తాం.

- అప్పలనాయుడు, జిల్లా జల వనరులశాఖ అధికారి

1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజన

జిల్లాలో 213 నీటి సంఘాలు ఉండగా.. 1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించాం. వచ్చేనెల 21 నుంచి 29వ తేదీ వరకు వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహిస్తాం.

- శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

పార్వతీపురం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సోమవారం తెలిపారు. 08963-293046 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను చెప్పొచ్చన్నారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు, గర్భిణులను ఆసుపత్రులు, వసతిగృహాలకు తరలించాలని ఆదేశించారు. నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు

పార్వతీపురం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ. 16 వేలు కేటాయించగా.. మొదటి విడతగా 512 అంగన్‌వాడీల్లో తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోనున్నారు. అదేవిధంగా 469 కేంద్రాల్లో ఉన్న మరుగుదొడ్లుకు ప్రత్యేక నీటి పైపులైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.36 వేల చొప్పున మంజూరు చేసింది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా 113 కేంద్రాలకు నిధులు మంజూరు చేయగా.. రెండో విడతలో 516 కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలను జారీ చేసిందని ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి తెలిపారు.



పోలీసుల సేవలు అభినందనీయం

- శాంతిభద్రతల పరిరక్షణలో వారు కీలకం
- అమరుల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అభినందనీయమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమరులైన పోలీసులకు ప్రాంగణంలోని స్మృతి వనంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రక్షణలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించడాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తేనే దేశంలోని ప్రజలంతా సుఖంగా ఉంటారన్నారు. జిల్లాలో ఎంతో ధైర్య సాహసాలతో మావోయిస్టులను ఎదుర్కొని... అమరులైన పోలీసు అధికారులు, సిబ్బంది త్యాగాలు మరువలేనివని కీర్తించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడే క్రమంలో పోలీసులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. పోలీసు ఉద్యోగానికి ప్రత్యేక గౌరవం ఉందన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రాగ ద్వేషాలు లేకుండా క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 216 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని... వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమర వీరుల స్మృతి స్తూపం వద్ద ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, అడిషనల్ ఎస్పీ సౌమ్యలత తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డీఎస్పీలు శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, వీర కుమార్, యూనివర్స్, ఇంటిలిజెన్స్ అధికారి వెంకటనాయుడు, ఏఓ శ్రీనివాసరావు, డీపీఓ కార్యాలయ ప్రతినిధులు వెంకటలక్ష్మి, ప్రభాకరరావు, పోలీసు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. అమరవీరులు షేక్ ఇస్మాయిల్ సతీమణి బాబీ జాన్, ఎస్.సూర్యనారాయణ రెడ్డి సతీమణి రాజు, చిట్టి పంతుల చిరంజీవిరావు సతీమణి విశాలక్షితో మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి అల్పాహారం చేసి... కొంత సమయాన్ని గడిపారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు.



అమర వీరుల కుటుంబాలతో ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జాతీయ పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. వారి త్యాగాలు మరువలేమన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించి... యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి సంక్షేమం కోసం కొంత నగదు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

పుట్ట కాదు.. ప్రమాదాల గుట్ట!

ఈ చిత్రం చూస్తే... ఇదేదో పాముల పుట్టలా కనిపిస్తోంది కదూ. మరికాస్త పరిశీలించండి. అసలు విషయం అర్థమవుతుంది. అవును... అది పుట్ట కాదు... గుట్ట. ఆపైన కనిపిస్తున్నది ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం. ఉంగరాడమెట్ట గురుకుల కళాశాల సమీపంలో ఇది కనిపిస్తుంది. 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభం అత్యంత ప్రమాదభరితంగా దీనిపై ఉంది. వాస్తవానికి కొండపైన స్తంభం ఉండేది. దీని చుట్టూ ఉన్న కంకర తవ్వుకుపోవడంతో ఈ స్తంభం ఇలా మిగిలింది. ఇది ఒకవైపు వాలిపోయి... కూలడానికి సిద్ధం ఉంది. దీనిపై ఇప్పటికే వండానిపేట గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి... స్తంభాన్ని మరోచోటకు తరలించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

-రేగిడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)



ఆడిస్తూ.. పాడిస్తూ.. చదివిస్తారు!

- వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఎడ్యుకేషనల్ వీడియో గేమ్స్
- 1 నుంచి పదో తరగతి వరకు యూట్యూబ్‌లో పాఠాలు
- విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా బోధన
- ఇదీ ఉషారాణి ప్రత్యేకత



తరగతి గదిలో బోధన

బొబ్బిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):

నేటి తరం విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా బోధించడంలో ఆమె ముందు వరుసలో నిలుస్తున్నారు. ఆమె... విజయనగరం జిల్లా బొబ్బిలి గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న చిట్టిమోజు ఉషారాణి. ప్రత్యేక శైలిలో విద్యాబోధన చేయాలని ఆమె తపిస్తుంటారు. చిన్నారులంతా ఆన్‌లైన్ ఆటల పట్ల మొగ్గు చూపుతుండడం తెలిసిందే. దీనిని ఆమె ఒక అవకాశంగా మలచుకున్నారు. ఫ్రీ స్మార్ట్ క్లాస్ అనే పేరుతో వెబ్‌సైట్‌ను గత ఏడాది హైదరాబాద్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. దీనిలో 50 ఆటలను రూపొందించి బాలబాలికలకు అందుబాటులో ఉంచారు. సుమారు 20 దేశాలకు చెందిన చిన్నారులు వీటిని వీక్షిస్తుండడం గమనార్హం. ట్రయల్ అండ్ ఎర్రర్, పిక్చర్ రీడింగ్ విధానాలతో రూపొందించిన ఆన్‌లైన్ పాఠాల పట్ల విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు. మై స్మార్ట్ క్లాస్ అనే వెబ్‌సైట్‌ను కూడా విద్యార్థి లోకానికి అందుబాటులో ఉంచారు. ఆటపాటలతో విద్యా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఆమె ఉచితంగా సేవలందిస్తున్నారు.

- ప్రాథమిక విద్యారంగంలో 3, 4 తరగతుల పాఠ్యాంశాల తయారీలో రెండుసార్లు ఆమె పాల్గొన్నారు.
- మై స్మార్ట్ క్లాస్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్ ద్వారా ఎడ్యుకేషనల్ గేమ్స్ వీడియోలను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులో ఉంచారు.
- సుబోధిని, మై జర్నీ యూ ట్యూబ్ చానల్ ద్వారా నీతి కథలు, మోటివేషనల్ స్టోరీలు విద్యార్థులకు అందిస్తున్నారు.
- విద్యార్థులంతా స్వయంగా, ఇష్టంగా పాల్గొనేలా వివిధ రకాల పోటీలు నిర్వహించి... వారిలో సృజనను వెలికి తీస్తున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులు ఎంతో ఆనందంగా గడిపే విధంగా వాటిని తీర్చిదిద్దారు.
- బోధనోపకరణాలను తయారు చేయించడమే కాక... కోలాటం, యోగా, క్రీడల్లో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. జాతీయ నాయకుల వేషధారణలు వేయించి... వారితోనే ప్రసంగాలు ఇప్పిస్తుంటారు. మట్టి వినాయకులను తయారు చేయించి... ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల సందర్భంగా విద్యార్థులతో ఆసక్తికరమైన కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను పంపిణీ చేయడం ఉషారాణి హాబీ. గొల్లపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులంతా మహిళలే. వారందరినీ సమన్వయ పరుచుకుంటూ పాఠశాలను గ్రామస్తులంతా మెచ్చుకునేలా తీర్చిదిద్దుతున్నారు.
- ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్ష కార్యక్రమాల్లో పొటెన్షియల్ ట్రైనర్‌గా సేవలందించారు. స్టేట్ రిసోర్స్ గ్రూపు సభ్యురాలిగా, వెబినార్ ప్రజెంటర్‌గా, ఈ కంటెంట్ క్రియేటర్‌గా, మాడ్యూల్ రైటర్‌గా రాష్ట్ర స్థాయిలో అనేక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. 2010, 2018 సంవత్సరాల్లో ఈవీఎస్ సబ్జక్టులకు పాఠ్యపుస్తకాల రచయితగా సేవలందించారు. గ్రీన్ చాలెంజ్ అనే నేషనల్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, విద్యావేత్త జయప్రకాశ్‌నారాయణ్‌ల నుంచి ప్రశంసలు అందుకున్నారు. వరల్డ్ వాటర్‌డే కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్నారు. తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాధించారు.



చంద్రబాబు ప్రశంసలు అందుకుంటున్న దృశ్యం (ఫైల్)



రీసర్వేలో లోపాలకు చెక్

- బొబ్బిలి ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామ్మోహనరావు

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో భూముల రీసర్వేలో భాగంగా జరిగిన లోటుపాట్లను సరిదిద్దే ప్రక్రియ ప్రారంభమైందని బొబ్బిలి ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రీసర్వే జరిగిన గ్రామాల నుంచి భూముల విస్తీర్ణం, యజమానుల పేర్లు, సరిహద్దులు, జాబితాలు తారుమారైనట్టు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వాటిని సరి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. దీని ప్రకారం రీసర్వే జరిగిన గ్రామాలలో రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నామని చెప్పారు. వాటిని 45 రోజులలోగా పరిష్కరిస్తామని వెల్లడించారు. బొబ్బిలి రెవెన్యూ డివిజన్ లోని అనేక గ్రామాలలో భూముల రిజిస్ట్రేషన్.. లావాదేవీలు జరగకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారని ఆర్డీఓ తెలిపారు. రైతుల పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఇతర అవసరాలకు భూములను అమ్ముకోవడానికి అడ్డంకులు ఎదురవుతున్నాయని.. వీటికి కూడా త్వరలో పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

రహదారికి ప్రతిపాదనలు..

గిరిజన యూనివర్సిటీకి సంబంధించి మెంటాడ మండలంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 4.58 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఇసుక పాలసీకి సంబంధించి కొత్త మార్గదర్శకాలు వెలువడ్డాయన్నారు. ట్రాక్టర్లు, నాటుబళ్లతో ఇసుకను తరలించేందుకు వెసులుబాటు కల్పించారన్నారు. తెలుపు రేషన్ కార్డుదారులకు 35 శాతం మందికి సరిపడా కందిపప్పు విడుదలైందని తెలిపారు. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో అందరికీ పంపిణీ చేసే విధంగా కందిపప్పు మంజూరవుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. నిత్యావసరాల పంపిణీలో అవకతవకలకు తావులేకుండా గట్టి నిఘా పెట్టినట్లు ఆర్డీఓ రామ్మోహనరావు వివరించారు.



పైడితల్లికి నృత్య నీరాజనం

విజయనగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరులతల్లి పైడితల్లమ్మ సిరిమానోత్సవాల్లో భాగంగా విజయనగరం రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న చదురుగుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వివిధ కీర్తనలు, గీతాలకు విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కళా ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



నేడు పైడిమాంబ తెప్పోత్సవం

- ట్రయల్ రన్ విజయవంతం
- ఏర్పాట్లు పూర్తి

విజయనగరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబ తెప్పోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం పెద్దచెరువు వద్ద ట్రయల్ రన్ నిర్వహించారు. ఆలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద చెరువులోకి పడవపై వెళ్లారు. మంగళవారం ఇదే పడవపై పైడిమాంబ విహరించనున్న నేపథ్యంలో ట్రయల్ రన్ విజయవంతమైందని అధికారులు తెలిపారు.

అలంకరణ పనుల్లో..

పైడిమాంబ తెప్పోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారు విహరించే పడవను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీనికి ముందు భాగంలో హంస రూపంలో తీర్చిదిద్దారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద వేద సభ నిర్వహించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు వనంగుడి నుంచి పైడిమాంబ విగ్రహాన్ని ఊరేగించనున్నారు. పెద్ద చెరువు వెనుక భాగాన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పోత్సవ వేదిక వరకూ ఊరేగిస్తారు. అనంతరం పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని పడవలో ఉంచి.. తెప్పోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు అర్ అండ్ బీ, మత్స్యశాఖ, రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖ, నగర పాలక సంస్థ సంయుక్తంగా తెప్పోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఇసుక కష్టాలుండవేమో

▸ వైసీపీ, కూటమి ప్రభుత్వాల మధ్య తేడా గుర్తిస్తున్న ప్రజలు ▸ వ్యాపార పంథాలో వెళ్తే నష్టమే ▸ అధికారులు పకడ్బందీ నిఘా పెడితేనే ఉపయోగం



శృంగవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకను ఉచితం చేసినప్పటికీ ధరలెక్కడా తగ్గలేదు. పైగా ఇసుక కొరత కనిపించింది. రీచ్‌ల నుంచి తరలిస్తున్న ఇసుకతో రవాణా చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం మారినా ఇసుకకు అవస్థ లు పడుతున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. స్థానికంగా వున్న ఇసుకపై గ్రామీణులకు వున్న హక్కును ఆయన గుర్తించా రు. నదులు, గెడ్డలు, వాగుల నుంచి ఇసుకను గ్రామీణ ప్రజలు ఎద్దుల బండ్లతో పాటు ట్రాక్టర్‌లతోనూ తీసుకెళ్లవచ్చని 2016లో కేంద్ర, అటవీ పర్యావరణ శాఖ విడుదల చేసిన మార్గదర్శ కాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేద, సామాన్యుడు ఎద్దు ల బండ్లు, ట్రాక్టర్లతో తవ్వుకొనే వెసులుబాటు కల్పించారు. రెవె న్యూ, గనులు, పోలీస్ శాఖలతో పాటు ఎవరూ వాటిని అడ్డుకో వద్దని గట్టి సంకేతాలు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు తలదూర్చొద్దంటూ హెచ్చరించారు.

జిల్లాలో ప్రధానంగా గోస్తనీ, చంపావతి నదులు ప్రవహిస్తు న్నాయి. గోస్తనీ నది అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి మండలాల నుంచి జిల్లాలోని గంట్యాడ మండలం తాటిపూడి జలాశయం నుంచి శృంగవరపుకోట, జామి మండ లాల మీదగా విశాఖ జిల్లా పద్మనాభం మండలం తగరపువలస దాటిన తరువాత బంగాళాఖాతంలో కలుస్తుంది. జిల్లాలో రెండు మండలాలకు చెందిన దాదాపు యాభై గ్రామాల వరకు ఈనది పరివాహక ప్రాంతానికి అనుకుని ఉన్నాయి. ఇక మెంటాడ మండలం అంద్ర వద్ద పుట్టిన చంపావతి నది గజపతినగరం, గుర్ల, నెల్లిమర్ల, డెంకాడ, పూస పాటి రేగ, భోగాపురం మండలాల మీదుగా ప్రవహించి కోనాడ వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. వందలాది గ్రామాలు ఈ నదీపరీవాహక ప్రాంతం వెంబడి ఉన్నాయి. పర్యా వరణ రహి తంగా ఇసుక లభ్యత లేకపోవడంతో జిల్లాలో ఎక్కడా ప్రభు త్వం రీచ్‌లను ఏర్పాటు చేయలేకపోతోంది. అయితే ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.కోట్లతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు, కాలువలు నిర్మించేందుకు చూస్తోంది. పల్లె పండగ పేరుతో పంచాయతీల్లో భూమి పూజలు చేస్తోంది. రోడ్లు, కాలువల నిర్మాణానికి ఇసుక అవసరం. ఇసుక లేకుండా నిర్మాణాలు సాగవు. టీడీపీ అధికారం లోకి రావడంతో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకు న్నాయి. దీంతో ఇసుక తవ్వుకునేందుకు కూటమి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లకు అనుమతించింది.

వ్యాపారంగా మార్చేసే ఎత్తుగడ

ప్రస్తుతం ఎద్దుల బండ్లతో తోలుతున్న ఇసుక రవాణా తిరిగి వ్యాపారంగా మారింది. కూటమి ప్రభుత్వం కల్పించిన ట్రాక్టరుతో ఇసుక రవాణా వెసలుబాటు వ్యాపారంగా మారేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. టాక్టర్లు వున్న యజమానులంతా సిండికేట్‌గా మారుతున్నారు. ప్రస్తుతం ఎద్దుల బండ్లతో రవాణా చేస్తున్న వారంతా గతంలో టాక్టర్లతో ఇసుక వ్యాపారం చేసిన వారే. ఒక్కో ఎద్దుల బండితో తీసుకొచ్చే ఇసుకను దూరం బట్టి రూ.1200ల నుంచి రూ.2000 వేలు వరకు తీసుకుంటున్నారు. గోపాలపల్లి, మామిడిపల్లి గ్రామాల పరిధిలో వున్న గోస్తనీ నది పరివాహక ప్రాంతం నుంచి శృంగవరపుకోట గ్రామానికి 6నుంచి 8కిలోమీటర్లు దూరం వుంటుంది. ఈ దూరానికి ఎద్దుల బండితో ఇసుకకు రూ.1200 వరకు తీసుకుంటున్నారు. పెరిగిన దూరం బట్టి ధర మారుతూ వుంటుంది. దీనికి తోడు కొంత మంది నదీపరీవాహక ప్రాంత గ్రామాల ప్రజాప్రతినిధులు తనపరిధిలోని నదిలో దిగే ప్రతి ఎద్దుల బండి నుంచి అదనంగా రూ.100 వసూలు చేస్తున్నారు. ఈ సొమ్మును కూడా వినియోగదారులపైనే ఇసుక వ్యాపారులు రుద్దుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వ విధానం పక్కదారి పట్టకూడదు. అధికారులు గట్టి నిఘా పెట్టాలి. పర్యావరణానికి ముప్పులేకుండా ఇసుక తవ్వకాలు జరిగేట్లు చూడాలని పలువులు అభిప్రాయపడుతున్నారు.

బకాయిలు విడుదల చేయాలి



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో బకాయి ఉన్న విద్యా, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకున్నారు. విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

హామీల అమలు మరిచారా?



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వలంటీర్లకు ఎన్నికల్లో ఇచ్చిన అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత ఆశోక్ కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనైనా సీఎం చంద్రబాబు నాయుడు వాలంటీరు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జేసీకి వినతి పత్రం సమర్పించారు. ఐఏటీయూసీ నాయకులు రవీంద్ర, అచ్చుత కుమారి ఉన్నారు.

గ్రీవెన్స్‌కు 180 వినతులు

విజయనగరం, కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 180 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో అనిత వినతులు స్వీకరించారు. వచ్చిన 180 వినతుల్లో భూసమస్యలకు సంబంధించి 122 వినతులు పింఛన్ కోసం 17, మున్సిపాలిటీకి 5, పంచాయతీరాజ్ శాఖకు 12, విద్యాశాఖ 4, వైద్య ఆరోగ్య శాఖకు 6 వినతులు వచ్చాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారులు అవస్థలు పడ్డారు. వారిని లోనికి రానివ్వకుండా పోలీసులు అడ్డుకోవడంతో కొందరు తమ సమస్యను అధికారులకు చెప్పుకోకుండా వెనుతిరగాల్సిన పరిస్థితి వచ్చింది.

ఎస్సీలపై దాడులను అరికట్టాలి

ఈ ప్రభుత్వహయంలోని ఎస్సీలపై జరుగుతున్న దాడులను ఆరికట్టాలంటూ అంబేద్కర్ పోరటా సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలోని వారు మాట్లాడుతూ అంబేద్కర్ బొమ్మను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


వినతులు స్వీకరిస్తున్న జేసీ సేతుమాధవన్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం


కొండకరకాం గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. విజయనగరం మండల పరిధిలో సోమవారం కొండకరకాం, ద్వారపూడి, గుంక లాం, జొన్నవలస, దుప్పాడ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పర్య టించి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద విడుదల చేసిన నిధులు సిద్ధంగా ఉండడంతో ఈ పనులను కూడా వేగంగా పూర్తిచేసేందుకు మండల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నెల్లిమర్ల: టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ మండలంలోని వల్లూరులో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు సో మవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సర్పంచ్ పంచాది జయలక్ష్మి, ఎంపీటీసీ లెంక నాగేశ్వరి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు తెలిపారు. మండలంలోని నర్సాపురం, దుప్పలపూడి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..


టీడీపీలో చేరిన కుమరాం వైసీపీ శ్రేణులు

జామి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సోమవారం మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు స్వామినాయుడు, పైడిరాజు, టీడీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొత్తలి సూర్యారావు ఆధ్వర్యంలో మంత్రి తండ్రి, గంట్యాడ ఎంపీపీ భాస్కరరావు ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు వేసుకున్నారు. టీడీపీ నాయకులు సబ్బవరపు సత్యనారాయణ, సుంకరి రామకృష్ణ, అప్పలనాయుడు, అర్జునరావు, శ్రీను, అనీల్ ఉన్నారు.

గౌరీశ్వరరావుకు పురస్కారం

రాజాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతు రాష్ట్ర పతి అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావుకి ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల కిచ్చి గౌరవించే రైతునేస్తం పురస్కారాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు సోమవారం అందజేశారు. గన్నవరం దగ్గరలో ఉన్న ఆత్కూరులో భారతి ట్రస్ట్‌లో దుశ్శాలు వతో సత్కరించి మెమోంటో సర్టిఫికేట్‌ను అందజేసి గౌరీశ్వరరావును ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో కాల్వ శ్రీనివాసులు. ట్రస్టుబోర్డు ప్రతినిధులు సభ్యులు పాల్గొ న్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ వారు స్వర్గీయ డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట ఈ అవార్డులను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందజేసి గౌరవిస్తున్నారు.


గౌరీశ్వరరావును సత్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

కబడ్డీకి గుర్తింపు తీసుకొస్తా

● అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

విజయనగరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కబడ్డీ ఆటలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ అన్నారు. విజయనగరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు కలిగిన అసోసియేషన్ మనదని అన్నారు. నాణ్యమైన, ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేసి దేశానికి అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.రంగారావు దొర, కె.వి.ప్రభావతి ఎన్నికయ్యారు. వీరితోపాటు 16 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, విశ్రాంత న్యాయమూర్తి సుబ్బరాజు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ అధ్యక్షులు అర్జునరాజు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, వాలీబాల్ కార్యదర్శి శ్రీను, క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి పి.సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మహిళల ఆందోళన

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని మేదరబంద జంక్షన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ మహిళలు సోమవారం ఐదోరోజు తమ ఆందోళన కొనసాగించారు. ఆ వార్డుకు చెందిన మహిళలు, స్థానికులు కలిసి మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. షాపు వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే బేబీనాయనకు, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ షాపు పరిసరాల్లో మద్యం సీసాలు, గ్లాసులు, సిగరెట్లు, బీడీలు వంటివి వీధుల్లో విచ్చలవిడిగా పారబోస్తున్నారని, అధికారులు స్పందించి మద్యం షాపును తరలించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

▸ అదనపు ఎస్పీ సౌమ్యలత


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీ సుస్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని అదన పు ఎస్పీ సౌమ్యలత అధికారులను ఆదే శించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాల యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి, 42 ఫిర్యా దులు స్వీకరించారు. బాధితుల సమస్యలను విని, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు. ఫిర్యా దుల్లో భూ తగాదా లకు సంబంధించి 15, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టుగా 6, ఇతర విషయాలకు సంబంధించి 17 ఫిర్యాదు లున్నాయన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి ఏడు రోజుల్లో తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు.

కెంగువలో నలుగురికి డయేరియా

గజపతినగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంగువ గ్రామంలో నాలుగు డయేరియా కేసులు నమోదైనట్టు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. సోమవారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామానికి చెందిన సుంకరి సింహాచలం, మండల సూరమ్మ, పెనుమజ్జి సత్యం డయేరియా బారినపడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, శనపతి బంగారునాయుడు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి వాంతులు, విరోచనాలతో ఇబ్బందులకు గురవుతున్న వ్యాధిగ్రస్థులను వైద్య సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూయస్ అధికారులు డీఈఈ తిరుపతిరావు, జేఈ శ్రీనివాసరావు వాటర్ ట్యాంక్‌నుంచి గ్రామానికి సరఫరా జరిగే తాగునీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నీటి నమునాలను తీసి పరీక్షా కేంద్రాలకు పంపిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీలు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిట్రాజు కళ్లాలు వద్ద ఉన్న రెండు ఆలయాల్లో దొంగలు పడి వెండివస్తువులను, హుండీలను ఎత్తుకుపోయారు. ఈవిషయంపై స్థానికులు, ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి, పైడితల్లమ్మ ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. పైడితల్లమ్మ ఆలయంలో వెండివస్తువులతో పాటు ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ ఎత్తుకుపోయారన్నారు. హుండీలో రూ.30వేలకు పైగా నగదు ఉంటుందని స్థానికులు తెలిపారు. విజయనగరంనుంచి క్లూస్ టీం వచ్చి ఆలయాలు చూసి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

నిందితుడి అరెస్టు

నెల్లిమర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 14న రాత్రి నిందితుతు గౌరీ ప్రసాద్ రాజరాజేశ్వరి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ఉన్న పది గ్రాముల రెండు వెండి కిరీటాలు, హుండీలోని మూడు వేల రూపాయల నగదును చోరీ చేశాడని ఎస్ఐ గణేష్ తెలిపారు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఆయన వద్ద నుంచి రెండు వెండి కిరీటాలతో పాటు 2500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిది శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం ఇజ్జాడపాలెం అని తెలిపారు.

బొబ్బిలిలో గుర్తు తెలియని మృతదేహం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి కోరాడ వీధి శివారు సాదీఖానాకు అనుకుని ఉన్న రాణీమల్లమ్మదేవి చెరువు గట్టు వద్ద సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. పోలీస్‌లు, సీఐ సతీష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కానిస్టేబుల్ చలపతిరావు, అక్కడే వున్న బొబ్బిలి మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ గట్టుపైకి తీసుకొచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే బొబ్బిలి పోలీస్ స్టేషన్‌కి 91211 09422, 91211 09454 నెంబర్లపై సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

గంట్యాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ ఆవల ఉన్న డీకేపర్తి పంచాయతీ పరిధిలో గల పెద్దపాడుకు చెందిన ఏర్రబోయిన దీన(4) అనారోగ్యంతో మృతి చెందింది. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దీన తండ్రి సీతయ్య గ్రామానికి దూరంలో పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్కడ తన కుమార్తెకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

24న మెగా జాబ్‌మేళా

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, రాష్ట్రనైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24న మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 18నుంచి 35 సంవత్సరాల వయస్సు వారంతా హెటిరో, జస్ట్‌డయల్, గ్లాండ్‌ఫార్మా, శ్రీరామ్‌ఫైనాన్స్ వంటి సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరై అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవన్‌ను కలిసిన అవనాపు విక్రమ్ దంపతులు

విజయనగరం దాసన్నపేట: జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వెనుకబాటుతనాన్ని రూపుమాపాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, అవనాపు భావన దంపతులు కోరారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేతను మర్యాదపూర్వకంగా కలెక్టరేట్ చాంబర్లో కలిశారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు.

శిక్షణా సమావేశానికి హాజరుకండి

లక్కవరపుకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించి 5 మండలాల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు శిక్షణా సమావేశం మంగళవారం ఎల్.కోటలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద జరగనున్నట్లు ఎమ్మెల్యే లలిత కుమారి తెలిపారు. ఈ నెల 26 నుంచి మొదలయ్యే పార్టీ సభ్యత్వ నమోదుపై అందరికి శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి శిక్షణ కార్యక్రమం ఉంటుంద న్నారు. సమావేశానికి బూత్ కన్వీనర్లు, క్లష్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నేతలు హాజరుకావాలని ఆమె కోరారు.

డయేరియా రోగులను పరామర్శించిన జడ్పీ చైర్మన్

గుర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డయేరియా బాధితులకు వైసీపీ నాయకులు అండగా ఉంటారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నాగళ్లవలస గ్రామంలో డయేరియా రోగులను పరామర్శించారు. జడ్పీటీసీ అప్పలనాయుడు, ఎంపీపీ సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు హెచ్చరికలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయ మెయిన్ గేట్ వద్ద, ఆవరణలో ఆటోలు నిలపవద్దని సీఐ సతీష్ కుమార్ సోమవారం హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణకు చేరుకుని ఆటో డ్రైవర్లను మందలించారు. వెంటనే ఆటోలు బయటికి తరలించాలని సూచించారు. ఇకపై ఈ కార్యాలయ ఆవరణలో పెట్టవద్దన్నారు.

రోగికి ఆర్థిక సాయం

కొత్తవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి కుటుంబానికి నిమ్మలపాలెం గ్రామానికి చెందిన జాయినింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆర్థిక సాయం అందజేసింది. కొత్తవలస జీఎస్ఎన్ రాజునగర్ కాలనీలో నివాసం ఉంటున్న ముక్కవల్లి నాగమణి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి సొసైటీ సభ్యులు నాగమణి భర్త ముక్కవల్లి సురేష్ కుమార్‌కు 10 వేల రూపాయలు అందించారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

వేపాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ఏవిధమైన సమస్యలు ఉన్నా ఫిర్యాదులు అందజేస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. మండలంలోని పెదగుడిపాల గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు గ్రామస్థుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని ఆమె తెలిపారు. వీటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వీధి కుక్కల తరలింపు

రాజాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ ఆధ్వర్యంలో 8వ వార్డులో 105 కుక్కలను పట్టుకొని సోమవారం శ్రీకాకుళం సంతాన నిరోధక ఆపరేషన్లు చేపట్టడానికి తరలించారు. ఇంతవరకు 302 కుక్కలను పట్టుకుని శ్రీకాకుళం తరలించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం కమిషనర్ శ్యాంపురం వెళ్లే మేదర వీధి వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు, కాలువల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉరిటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, ఎమిడియాలజిస్ట్ శ్రీధర్ సూచించారు. పెదపెంకి గ్రామాన్ని వారు సోమవారం సందర్శించారు. గ్రామంలోని ఫైలేరియాతో బాధపడుతున్న రోగుల వద్దకు వెళ్లి పరిశీలించి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. పారిశుధ్యంపై సర్పంచ్, సెక్రటరీని అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కాంతికిరణ్మయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా



ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పాలకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి కోసం మండల రైతులు రోడ్డెక్కారు. మండలంలోని వెలగవాడ, పీఆర్‌రాజుపేట, పాలకొండ, ఓని తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ప్లకార్డులతో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. తక్షణమే సాగునీరు అందించాలని, లేనిపక్షంలో చివరి దశలో ఉన్న పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక దశలో నీటిపారుదల శాఖ ఏఈ శంకరరావుతో వాగ్వివాదానికి దిగారు. లస్కర్ల కొరత, ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో సాగునీరు లేని పరిస్థితి కారణంగా అందించలేకపోయామని ఏఈ రైతులకు బదులిచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులను సముదాయింపు చేశారు. అనంతరం ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఆయకట్టు రైతులు ఖండాపు ప్రసాదరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

పాలకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, సంఘం ప్రధాన కార్యదర్శి మన్మథరావు, జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఎన్‌వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

కురుపాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ హాస్టల్ వార్డెన్లకు ఆదేశించారు. కురుపాం గిరిజన సంక్షేమ బాలికల, బాలుర, మహాత్మ జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలను ఆమె సోమవారం సందర్శించారు. భోజన మెనూపై వార్డెన్లలకు అడిగి తెలుసుకున్నారు.

5 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు

జియ్యమ్మవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 5 లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని రేంజర్ డి.గంగరాజు తెలిపారు. సోమవారం ఆయన తాళ్లడుమ్మ పంచాయతీ రావాడలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం కురుపాం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో టేకు, సరుగుడు, నీలగిరి వంటి 5 లక్షల మొక్కలు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పెంచేందుకు నిర్దేశించిందన్నారు. ఇప్పటికే 4 చోట్ల మొక్కలు పెంచేందుకు అనువుగా ఉన్నాయని గుర్తించామని చెప్పారు.

గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

బెలగాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. పార్వతీపురంలోని జీజీ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ మొట్టమొదటి మహాసభ నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి పార్వతీపురం బస్టాండ్ నుంచి జీజీ కళాశాల క్రీడా మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ బహిరంగ సభలో జాన్సన్ మాట్లాడారు. జిల్లాలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రవి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహంలో విధులు వద్దు

సీతంపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట వైటీసీ గర్భిణుల వసతిగృహంలో తమకు డ్యూటీలు వేస్తున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని దోనుబాయి, మర్రిపాడు, కుసిమి పీహెచ్‌సీల ఏఎన్ఎంలు వాపోయారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి సమర్పించారు. గర్భిణుల వసతిగృహంలో నైట్ డ్యూటీ చేసుకుని ఉదయాన్నే సచివాలయానికి వెళ్లి థంబ్ వేసి పీహెచ్‌సీల్లో విధులకు సకాలంలో హాజరుకాలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీడీ అన్నదొరకు వినతిపత్రం అందజేశారు.

టీడబ్ల్యూ ఇంజనీరింగ్ ఈఈగా రమాదేవి

సీతంపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ రెగ్యులర్ ఈఈగా పి.రమాదేవి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఈమెని పదోన్నతిపై సీతంపేట టీడబ్ల్యూ ఈఈగా బదిలీ చేస్తూ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈమె 2009 నుంచి 2012 ఏడాదిలో శ్రీకాకుళం జిల్లా మందస డివిజన్‌లో ఇంజనీరింగ్ డీఈగా విధులు నిర్వర్తించారు. గతంలో రంపచోడవరం, కేఆర్ పురం ఐటీడీఏలో టీడబ్ల్యూ ఈఈగా అదనపు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు నిర్వహించారు. ఇంతవరకు సీతంపేట టీడబ్ల్యూ ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.సింహాచలం ఇకపై డీఈగా కొనసాగనున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై విచారణ

గరుగుబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రావివలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గుంట్రెడ్డి రామారావు తొలగింపుపై సోమవారం విచారణ నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈయన్ని అకారణంగా తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌డీవో ఎన్.రమేష్‌రాయన్ విచారణ నిర్వహించారు. గతంలో విధులు నిర్వహించిన ఏపీవో టి.రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ చింతాడ రుద్రకోటేశ్వరరావు నుంచి ఆయన సమాచారం సేకరించారు. ఈ విచారణకు ఎంపీడీవో జి.పైడితల్లి హాజరుకాలేదు. పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించి, నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఎల్‌డీవో తెలిపారు. ఈ విచారణలో టెక్నికల్ అసిస్టెంట్ సౌజన్య, ఉపాధి ఈసీ హరికృష్ణ ఉన్నారు.

పీహెచ్‌సీల పరిధిలో ప్రసవాలు జరగాలి

గరుగుబిల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి తెర్లి జగన్మోహన్‌రావు సూచించారు. సోమవారం గరుగుబిల్లి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. గర్భిణుల నమోదు, హైరిస్క్, రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

గరుగుబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చెం మైనింగ్‌కు చెందిన వాహనాలను అడ్డుకున్న ఘటనలో పెదగుడబకు చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మైనింగ్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టామని చెప్పారు. వాహనాలు అడ్డగింతతో పాటు పనులు నిర్వహణకు ఆటంకం కల్పిస్తున్నారని మైనింగ్ ప్రతినిధి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారని చెప్పారు. క్వారీ నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నా ఆటంకాలు కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారని ఆయన తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

బెలగాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం పార్వతీపురంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ నేరుగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, ఎస్‌ఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కదం తొక్కారు

- ఐటీడీఏ వద్ద గిరిజనుల ధర్నా



ఐటీడీఏ కార్యాలయ గేటు ఎదురుగా బైఠాయించిన గిరిజనులు

సీతంపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీ గిరిజనులు తమ సమస్యలపై కదంతొక్కారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ పార్క్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ గేటు వద్ద బైఠాయించారు. ఈసందర్భంగా గిరిజన సంఘం నాయకులు తిరుపతిరావు, సాంబయ్యలు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ బిడ్డలు కోసం ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరారు. వచ్చే సోమవారం నాటికి తామ సమస్యలపై అధికారులు స్పందించకుంటే ఐటీడీఏ కార్యాలయంలో వంట- వార్పు కార్యక్రమం నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా డీడీ అన్నదొరకు వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన సంఘం నాయకులు జి.సుందరమ్మ, పి.సాంబయ్య, భాస్కరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

మీ పద్ధతి మార్చుకోరా.. నేనే మారుతా

- పారిశుధ్య, సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే విజయచంద్ర ఫైర్

పార్వతీపురంటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'మీ పద్ధతి మార్చుకోరా.. సరే నేనే మారుతా' అని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. శాశ్వత, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, వారి పనులను పర్యవేక్షించే సచివాలయ ఉద్యోగులకు హెచ్చరించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణంలోని 30 వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న శాశ్వత, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణపై అక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఫిర్యాదుల ప్రకారం ఎలా పనిచేస్తున్నారో అర్థమవుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఇక నుంచి 30 వార్డుల్లో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల లోపుగా పారిశుధ్య నిర్వహణ పనులకు సంబంధించి అప్‌లోడ్ ప్రక్రియను చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరురాజుకు సూచించారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం

పార్వతీపురంటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తవలస శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో 18 కంపెనీల్లో ఉపాధి పొందేందుకు 578 హాజరు కాగా ఆయా కంపెనీల్లో 85 మందిని ఎంపిక చేశామని చెప్పారు. అనంతరం నియామక పత్రాలు పంపిణీ చేశారు. డీఎస్‌డీవో కె.సాయికృష్ణ చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతిరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

సీతానగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గెడ్డెలుప్పి ఆర్‌అండ్‌బీ కూడలి నుంచి కొత్తవలస రోడ్డు వరకు బీటీ రోడ్డుకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు గోపాల్‌నాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

గాలి వానకు పంట నష్టం

సాలూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలో ఆదివారం అర్ధరాత్రి గాలివాన ధాటికి కొదమ పంచాయతీలో మోనంగి, ఎస్.చింతలవలస, కూర్మరాజుపేట తదితర గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఈ గాలుకు కొన్ని ఇళ్లకు పాక్షికంగా నష్టం వాటిల్లినట్టు గిరిజనులు తెలిపారు. ● గాలులకు నష్టపోయిన పంటను అంచనా వేశామని సాలూరు వ్యవసాయాధికారి అనురాధ పండా సోమవారం తెలిపారు. మోనంగిలో 14 ఎకరాలు, చింతలసలో ఎకరం ఇలా వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టాలను అంచనా వేసి ఏఈఏకు నివేదించామని చెప్పారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం విజయవాడలో ఐటీడీఏ పీవోలతో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు మంత్రి ఫోన్ ద్వారా ఆంధ్రజ్యోతికి చెప్పారు. గిరిజన విద్యాలయాల్లో ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీవోలను ఆదేశించినట్టు ఆమె తెలిపారు. గిరిజనులు పండించే ప్రతి ఒక్క వస్తువును జీసీసీ ద్వారా కొనుగోలు చేసే చూడాలని ఆదేశించినట్టు చెప్పారు. డోలీల మాట వినపకూడదన్నారు.

బొడ్డపాడు పాఠశాలను తెరవాలి

సాలూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లేడువలస పంచాయతీ బొడ్డపాడులో మూసివేసిన జీపీఎస్ పాఠశాలను తెరవాలని గిరిజనులు ధర్నా చేశారు. సోమవారం సాలూరు ఎంఈవో కార్యాలయం ఎదుట గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.